క్లుప్తంగా

నూతన అత్యుత్సాహం వద్దు

● ఓవరాక్షన్ చేస్తే కేసులు : డీఎస్పీ


సుధాకర్‌రెడ్డి

పలమనేరు/బైరెడ్డిపల్లె/కుప్పం/పుంగనూరు: నూతన సంవత్సర వేడుకల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. పలమనేరు, బైరెడ్డిపల్లె, కుప్పం, పుంగనూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 31వ తేదీ రాత్రి 10 గంటల తర్వాత ప్రజలు గుంపులుగా తిరుగుతూ ఒకే ప్రదేశంలో ఉండరాదన్నారు. రాత్రి పూట వాహనాలు తనిఖీ ఉంటుందని, మద్యం సేవించినా, ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్లినా, రహదారిపై బైక్ రేస్ నిర్వహించినా, రోడ్ల మీద కేక్ కటింగ్‌లతో యువత ఓవరాక్షన్ చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని కోరారు. రాత్రి 10 గంటలపైన బార్లు, హోటళ్లు, రెస్టారెంట్లు మూసివేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి లేదన్నారు. వీధిదీపాలకుగానీ, ప్రభుత్వ ఆస్తులకు గానీ నష్టం వాటిల్లే పనులు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

విషజ్వరాలపై అప్రమత్తం

రొంపిచెర్ల: గ్రామాల్లో విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ అన్నారు. శనివారం రొంపిచెర్లలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ విద్యాసాగర్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీ గీతాశ్రీ, ఆరోగ్య కార్యకర్త వెంకటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

‘రేషన్ పంపిణీకి వలంటీర్ల సేవలు’


మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామన్

పుంగనూరు: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరకులను వలంటీర్లు దగ్గరుండి లబ్ధిదారులకు అందేలా చూడాలని తహసీల్దార్ సీతారామన్ ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ నారాయణ, వెటర్నరీ ఏడీ మనోహర్‌తో కలసి మండలంలోని వలంటీర్లకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో పంపిణీ పాయింట్లను ఏర్పాటు చేసుకుని ఆ ప్రాంతంలో ప్రజలకు సరుకులు ఇవ్వాలన్నారు. దీనిని ఆయా పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, జగనన్న సురక్ష పథకం కింద జనవరి 5తేదీ వరకు లబ్ధిదారుల నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఏఓ రాజేశ్వరి, డీటీ తహసీనా పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు వాహనాలు

● కమిషనర్ నరసింహప్రసాద్


పారిశుధ్య ట్యాంకర్ల వద్ద కమిషనర్ నరసింహప్రసాద్, చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మున్సిపాలిటీలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం రూ.96 లక్షల విలువ చేసే మూడు సెప్టిక్ ట్యాంకర్లు ఉన్న వాహనాలను మంజూరు చేసిందని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీకి వచ్చిన మూడు సెప్టిక్ ట్యాంకర్లను చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి పరిశీలించి ఆయన మాట్లాడారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషితో జిల్లాలో పుంగనూరుకు మాత్రమే నేషనల్ సఫాయి కార్పొరేషన్ సంయుక్తంగా వీటిని ఇచ్చిందన్నారు. రోజూ పట్టణంలో మురుగునీటిని ఎప్పటికప్పుడు వీటితో తొలగించేందుకు వీలుందన్నారు. అలాగే పట్టణంలోని సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసేందుకు అద్దెకు వీటిని ఇవ్వనున్నట్టు చెప్పారు. పట్టణ ప్రజలు తమ ఇళ్ల వద్ద సెప్టిక్ ట్యాంకులను నిర్మించుకోవాలని కోరారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



సదుం: పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని 26 మందికి కార్మికులకు పెద్దిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ ఉషారాణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, నాయకులు రమేష్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, చిన్నరమణ, రమణారెడ్డి, ఎల్లారెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంప్రదాయ వస్త్రాల పోటీ

శాంతిపురం: కూతేగానిపల్లె వద్ద ఉన్న పరమహంస యోగానంద పాఠశాలలో విద్యార్థులకు సాంప్రదాయ వస్త్రధారణ పోటీలను శనివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించినట్టు ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం


టీడీపీ కౌన్సిలర్‌కు సమాధానం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మండీసుధా, హైదర్

● మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి
● మున్సిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం


బడ్జెట్‌ను ప్రవేశపెట్టి చర్చిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించి 2023–24 రివైజ్డ్ బడ్జెట్, 2024–25 బడ్జెట్‌కు మున్సిపల్ పాలకమండలి ఆమోదించింది. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన వహించి మాట్లాడారు. ఈ బడ్జెట్‌లో ఆదాయానికి సంబంధించి 2022–23కి రూ.7.46కోట్లు, 2023–24కి రూ.9.23కోట్లు, 2024–25కి సంబంధించి రూ.9.41కోట్లు అని తెలిపారు. ఖర్చులకు సంబంధించి 2022–23కు రూ.7.29కోట్లు, 2023–24కు సంబంధించి రూ.8.76కోట్లు, 2024–25కు రూ.9.19 కోట్లుగా పేర్కొన్నారు. ఇక నిధులకు సంబంధించి 2022–23కు రూ.7.55 కోట్లు 2023–24కు రూ.8.35 కోట్లు, 2024–25కు రూ.7,72 కోట్లుగా తెలిపారు. నిధులకు సంబంధించిన ఖర్చుల్లో 2022–23కు రూ.6.88కోట్లు, 2023–24లో రూ.8.11కోట్లు కాగా 2024–25లో రూ.7.60 కోట్లు అని వివరించారు. ఈ బడ్జెట్‌ను పలమనేరు పట్టణ అభివృద్ధే లక్ష్యంగా రూపొందించినట్లు చెప్పారు.

టీడీపీ పాలనలోని విద్యుత్ అప్పులను ఈ ప్రభుత్వంలో కట్టాం

ఫైనాన్స్ కమిషన్ నిధులను అభివృద్ధికి వెచ్చించకుండా కరెంట్ బిల్లులకు ఎలా చెల్లిస్తారని టీడీపీ కౌన్సిలర్ శారద అడిగిన ప్రశ్నకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మండీసుధా, హైదర్ స్పందించారు. గత టీడీపీ పాలనలో ఇదే మున్సిపాలిటీలో కరెంట్ బకాయిలు రూ.9.70 కోట్లుగా ఉందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ బకాయిలను చెల్లించిందని, అప్పట్లో ఈ విషయాన్ని మాజీమంత్రి అమరనాథ రెడ్డి దృష్టికి పాలకమండలి తీసుకెళ్లినా ఆయన బిల్లుల గురించి పట్టించుకోకపోవడంతో ఈ సమస్య వచ్చిందని స్పష్టం చేశారు.

బడ్జెట్‌పై ముందే కౌన్సిల్‌లో చర్చించి ఉంటే బాగుండేది

కౌన్సిలర్ కోదండరామయ్య మాట్లాడుతూ, ఏటా బడ్జెట్‌ను సిస్టంలో తీసుకుని కట్ అండ్ పేస్ట్ చేసి పదిశాతం పెంచి సభలో పెట్టడం కరెక్ట్ కాదన్నారు. బడ్జెట్‌కు ముందు పాలక మండలి సలహాలు–సూచనలను స్వీకరించి ఉంటే బడ్జెట్‌లో మున్సిపల్ ఆదాయం పెరిగే మార్గం ఉండేదని పేర్కొన్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువుల జరిమానాలు, ఆక్రమణలు, అనధికారిక నిర్మాణాలపై ఫీజుల వసూళ్లు పెంచి ఉంటే బాగుండేదన్నారు. దీనిపై కమిషనర్ కిరణ్‌కుమార్ ప్రతిస్పందిస్తూ, గౌరవ సభ్యుల సలహా మేరకు అవసరమైన మార్పులను బడ్జెట్‌లో చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గుల్జార్, రవి, వివిధ శాఖల మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భరత్‌ను ఆశీర్వదించండి


పసుపు కుంకుమ, చీరను అందజేస్తున్న దుర్గ, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్

● ప్రజలను అభ్యర్థించిన దుర్గ
● ఎమ్మెల్సీతోపాటు ఎంపీ, జెడ్పీ చైర్మన్ ప్రచారం

రామకుప్పం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్‌ను కుప్పం ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి దుర్గ ప్రజలను కోరారు. మండలంలోని రాజుపేట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం దుర్గ ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. సారెగా పసుపు, కుంకుమ, చీరలను అందజేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, ఆ పథకాలతో చేకూరిన లబ్ధిని లబ్ధిదారులకు చెప్పారు. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉన్న భరత్‌కు ఈసారి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, స్థానిక సర్పంచ్ నీలమ్మ, కుప్పం ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ లలిత పాల్గొన్నారు.

సిమెంటు రోడ్ల పరిశీలన

స్థానిక ఇందిరానగర్‌లో కొత్తగా వేస్తున్న సిమెంటు రోడ్లను శనివారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పరిశీలించారు. రామకుప్పంలోని అన్ని వీధుల్లో సిమెంటు రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రామకుప్పంలో దాదాపు కోటి రూపాయలతో సీసీ రోడ్లు వేయనున్నట్లు వారు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ, స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, మురుగేష్ పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి పేదలకు అందేలా చూడాలని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తీర్థం జగనన్న కాలనీలో మూడు నెలల క్రితం జిల్లా కలెక్టర్ పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదని సర్పంచ్ జ్యోతమ్మ, ఎంపీటీసీ రవీంద్రమ్మ మండిపడ్డారు. గడ్డూరు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని సర్పంచ్ చంద్రమౌళి తెలిపారు. బైరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రిలో చిన్న చిన్న సమస్యలు వచ్చినా పలమనేరుకు రెఫర్ చేస్తున్నారని కో–ఆప్షన్ సభ్యుడు ఫైజుల్లా అసహనం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ హౌసింగ్ అధికారులను కోరారు. సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కేశవులు, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, తహసీల్దార్ కుమారస్వామి, ఎంఈఓ సాయిలీల, ట్రాన్స్‌కో ఏఈ హేమచంద్రుడు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరిస్తాం


వి.కోట: మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

పుంగనూరు: తమ దృష్టికి తీసుకువచ్చిన దళితుల సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ సీతారామన్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు చెన్నరాయుడు, రాజు, అశోక్, శంకరప్ప , నరసింహులతో కలసి అధికారులు, ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేసి ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ నారాయణ, మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్, ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరి, ఏఈలు ధనుంజయమూర్తి, శశికుమార్, ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ యువరాజు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మండల అధికారులు హాజరై తమ శాఖలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు, చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు సంబంధించిన సీసీరోడ్లు, డ్రైనేజీలు, శ్మశాన వాటికలకు సంబంధించి దారులు, వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ సూచించారు. ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజ, పక్కన ఎంపీపీ ఈశ్వరయ్య, హాజరైన వలంటీర్లు

సోమల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చూడాలని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ నాగరాజ అధ్యక్షతన కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లతో ఎంపీపీ సమీక్షించారు. ఆయనతోపాటు ఎంపీడీఓ మాట్లాడారు. పింఛన్ల సొమ్ము పెంపు, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలపై అవగాహన కల్పించారు. పండుగ వాతావరణంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేశారని, దీనిని ప్రజలకు చాటిచెప్పాలని కోరారు. సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధరం, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, ఈఓపీఆర్డీ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

శ్మశానానికి మట్టి రోడ్డు


పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

కుప్పం రూరల్: మున్సిపాలిటీలోని చీలేపల్లెలో ఇప్పటి వరకు శ్మశాన వాటికకు రోడ్డు సదుపాయం లేదు. శనివారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ గ్రామస్తులతో కలిసి రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా శ్మశానానికి రోడ్డు లేక అంత్యక్రియలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారమని, ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ సహకారంతో సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరామయ్య, చలపతి, చీలేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ ఆర్థిక సాయం


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లె పంచాయతీ ఆనిగానూరుకు చెందిన వెంకటప్ప, పెద్దగానూరుకు చెందిన తిమ్మారెడ్డి శనివారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూ.10 వేల చొప్పున మృతుల కుటుంబాలకు అందజేశారు. అలాగే మండలంలోని మణీంద్రం గ్రామానికి చెందిన చిన్నమ్మ మృతి చెందారు. స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చంద్రమోహన్ రెడ్డి ద్వారా ఎమ్మెల్సీ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం , ఎంపీటీసీ వెంకట్రామ గౌడు, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, నేతలు రఘు, శివప్రకాష్, చంద్ర పాల్గొన్నారు.

కదిరిఓబనపల్లెలో..

శాంతిపురం: కదిరిఓబనపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేష్(60) కుటుంబాన్ని ఎమ్మెల్సీ భరత్ శనివారం పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం మృతుడి భార్య సాలమ్మకు రూ 10 వేలను అందజేశారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

పలమనేరు: టి.వడ్డూరు వద్ద కోతిగుట్ట గ్రామానికి చెందిన ప్రసాద్(23) తన స్వగ్రామానికి శనివారం బైక్‌పై వెళుతూ అదుపుతప్పి, పక్కనే ఉన్న చింత చెట్టును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెల్‌నెస్ సెంటర్ వైద్య సిబ్బంది చికిత్స చేశారు.

పారిశుద్ధ్య కార్మికులు, ఆటోనగర్‌కు 8 ఎకరాల స్థలం

● ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా, పక్కన కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: పట్టణంలోని పారిశుధ్య కార్మికులకు 2 ఎకరాలు, డ్రైవర్లు, మెకానిక్స్, లారీ డ్రైవర్స్ అసోసియేషన్‌కు, కమ్యూనిటీ హాల్ కలసి ఆటో నగర్ ఏర్పాటు కోసం 6 ఎకరాల భూమిని కేటాయిస్తూ మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాను కౌన్సిలర్ పూల త్యాగరాజు ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిల సూచన మేరకు పట్టణ సమీపంలో కోట్లాది రూపాయల విలువ చేసే 8 ఎకరాల భూమిని చెర్లోపల్లె వద్ద ఆటోనగర్‌కు కేటాయించామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి, ఎంపీలకు రాబోవు ఎన్నికల్లో అండగా నిలవాలని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చైర్మన్ పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ లలిత, కౌన్సిలర్లు, జెఏఓ శ్రీనివాసులు, ఆర్‌ఓ కమలాకర్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ రూ.51.92 కోట్లు

పురపాలక సంఘ నూతన వార్షిక బడ్జెట్‌ను ప్రజలపై ఎలాంటి భారం లేకుండా తయారు చేసి, కౌన్సిల్‌లో ఆమోదించినట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. కమిషనర్ బడ్జెట్ ప్రతిపాదనలను కౌన్సిల్‌లో పెట్టారు. ఖర్చులు రూ.31.27 కోట్లు పోను మిగులు రూ.20.64 కోట్లుగా తయారు చేశామన్నారు. ఇందులో పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనకు అధికశాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎలాంటి పన్నుల విధించకుండా సవరణలతో బడ్జెట్‌ను రూపొందించినట్లు చెప్పారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేయండి


వలంటీర్లతో మాట్లాడుతున్న అధికారులు

రొంపిచెర్ల: జనవరి 1న రొంపిచెర్లలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, ఎంపీడీఓ రాజేంద్ర కోరారు. శనివారం స్థానిక రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. సోమవారం ఇదే ప్రదేశంలో నిర్వహించనున్న బహిరంగ సభలో రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె గ్రామాల లబ్ధిదారులు 400మందికి మంత్రి పెద్దిరెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్ర, డీటీ లోకేష్, ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, హౌసింగ్ ఏఈ యోగానంద్ రెడ్డి, ఆర్ఐ అబ్దుల్ ఖాదర్, కార్యదర్శులు నాగరాజ, హరిబాబు, రవిచంద్రబాబు పాల్గొన్నారు.

హైవే పనులను అడ్డుకుని నిరసన

● ప్రహరీ గోడ నిర్మాణంతో కాలనీకి రోడ్డు బంద్
● జగనన్న కాలనీ వాసుల ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న జగనన్న కాలనీ వాసులు

బైరెడ్డిపల్లె: బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులను శనివారం బైరెడ్డిపల్లె జగనన్న కాలనీ వాసులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ, బైరెడ్డిపల్లె సమీపంలో కొత్తగా జగనన్న కాలనీలో సుమారు 400 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేయడంతో పలువురు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నట్టు చెప్పారు. అయితే బైరెడ్డిపల్లె షాదీమహల్ నుంచి కాలనీకి వెళ్లే రహదారికి అడ్డంగా ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో భాగంగా ప్రహరీ గోడ నిర్మిస్తుండడంతో రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీలో నిర్మాణ పనులకు ఇసుక, కంకర, ఇటుకరాళ్లు, సిమెంటు మొదలైన వాటిని తీసుకెళ్లేందుకు వీలు లేకుండా పోతుందన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు కారణంగా జగనన్న కాలనీకి రోడ్డు సౌకర్యం పూర్తిగా కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జగనన్న కాలనీకి రహదారిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జోరుగా ‘ఆడుదాం ఆంధ్రా’


పలమనేరు: టి. వడ్డూరులో..


పుంగనూరు: టాస్ వేస్తున్న క్రీడాకారులు



సదుం: కబడ్డీ పోటీలు.., పులిచెర్ల: విజేతలకు నగదు అందజేస్తున్న ఎంపీటీసీ పోకల చంద్ర


రొంపిచెర్ల: ఖో–ఖో ఆడుతున్న విద్యార్థులు

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు సచివాలయంలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా శనివారం పంచాయతీ స్థాయిలో కబడ్డీ పోటీలను మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు, స్థానిక సర్పంచ్ మునస్వామి ప్రారంభించారు.

పుంగనూరులో..

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో శనివారం కమిషనర్ నరసింహప్రసాద్, చైర్మన్ అలీమ్‌బాషా బ్యాడ్మింటన్ పోటీలను, అలాగే మండలంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ ఇతర పోటీలను ప్రారంభించారు. వివిధ పోటీల్లో గ్రామీణ క్రీడాకారులు తమ సత్తా చాటారు.

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శనివారం ప్రత్యేక అధికారి మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ఎంఈఓ దామోదర, ఎంపీడీఓ వరప్రసాద్, పీడీ రెడ్డి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు బహుమతి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకల వారిపల్లె సచివాయ పరిధిలో ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో విన్నర్స్, రన్నర్స్‌కు రూ.2116, రూ.1116లను ఎంపీటీసీ పోకల చంద్ర అందజేశారు. సర్పంచ్ పోకల ఉమాదేవి, దామోదర్‌రెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖో–ఖో విజేత కేజీబీవీ బాలికలు

రొంపిచెర్ల: పురుషులు, మహిళల విభాగంలో రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఖో–ఖో పోటీలను శనివారం నిర్వహించారు. మహిళల విభాగంలో కస్తూర్బా గురుకుల పాఠశాల ఇంటర్ విద్యార్థినులు, పురుషుల విభాగంలో రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచినట్లు పీఈటీ శ్రీవాణి తెలిపారు. ఆటల పోటీలను సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ప్రారంభించారు.

పింఛన్ల పంపిణీ పండుగలా చేద్దాం


సదుం: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి


చౌడేపల్లె: మాట్లాడుతున్న ఎంపీపీ

సదుం: జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు సంబంధించి వాటిని లబ్ధిదారులకు పండుగ వాతావరణంలో పంపిణీ చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. పింఛన్ల పంపిణీ, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల పంపిణీపై ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. జనవరి 4 నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం కానున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ఎంపీడీఓ వరప్రసాద్, డీటీ కుమార్, సర్పంచ్ ఉషారాణి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: ప్రభుత్వం పెంచిన పెన్షన్లు గ్రామాల్లో పండుగ వాతావరణంలో పంపిణీ చేయాలని ఎంపీపీ రామమూర్తి ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు రూ.3 వేలను ఇవ్వనున్న నేపథ్యంలో జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటి చైర్మన్ కళ్యాణ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ సాధిక్, ఎంపీడీఓ సుధాకర్ పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: కొత్త సంవత్సరంలో రూ. 3వేల పింఛన్ల పంపిణీని ఓ పండుగలా చేయాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరితో కలసి కౌన్సిల్ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని జనవరి 3న సీఎం లాంచ్ చేయనుండడంతో అదే రోజు స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ అధ్యక్షతన ప్రజాప్రతినిధులతో పింఛన్ల పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఆపై 8వ తేదీ వరకు పింఛన్ల పండుగ కార్యకమాలు కొనసాగిస్తామన్నారు. ఆ తర్వత నిర్వహించే కార్యక్రమాలను తెలియజేశారు.

వి.కోటలో..

వి.కోట: వలంటీర్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ప్రజలకు ప్రభుత్వ పథకాల చేరవేయడంలో ముందుండాలని ఎంపీపీ యువరాజు అన్నారు. స్థానిక దుర్గామాత ఆలయ కమిటీ హాల్‌లో వలంటీర్ల, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. జనవరి 7న ఆదివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా రూ.3వేల పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల ప్రత్యేకాధికారి కోటేశ్వరావ్, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: జనవరి నెలలో ఇచ్చే 4వ విడత విడత సంక్షేమాలపై శనివారం స్థానిక శ్రీశక్తి భవనంలో ఎంపీడీఓ తాజ్ మస్రూర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం జనవరి నెల నుంచి సామాజిక పెన్షన్లను రూ.2750 నుంచి రూ 3000 వరకు పెంచుతోందని, చివరి విడత వైఎస్సార్ ఆసరాను గ్రూపులకు జమ చేయనుందని ఆయన చెప్పారు. అలాగే చేయూత పథకం రూ 18750లను, జగనన్న తోడు వడ్డీ మొత్తాన్ని వచ్చే నెల 19న ముఖ్యమంత్రి విడుదల చేస్తారన్నారు. వీటి గురించి ప్రజలకు చాటి చెప్పాలని వైఎస్సార్ క్రాంతి పథం మహిళలను కోరారు. ఈఓపీఆర్‌డి శంకర్, ఏపీఎంలు ధనయ్య, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.